క్లుప్తంగా

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



సాయి పారాయణం చేస్తున్న భక్తులు

గుత్తి: పట్టణంలోని షిరిడీ సాయిబాబా ఆలయం 32వ వార్షికోత్సవం ఆదివారం భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూజారులు స్వామి కి ప్రత్యేక పూజలు, మండల పూజ చేశారు. సాయి పారాయణం చేశారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు తీర్థ ప్రసాదాలు వినియోగం చేశారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

గుత్తి: పట్టణంలోని జంగాల కాలనీలో నాగరాజు అనే వ్యక్తి ఆదివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో పడి ఉన్న నాగరాజును కుటుంబ సభ్యులు గమనించి వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురం రెఫర్ చేశారు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియరాలేదు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

టిప్పుసుల్తాన్‌కు నివాళి



రోగులకు పండ్లు, బ్రెడ్డు పంపిణీ చేస్తున్న టిమ్ నాయకులు

గుంతకల్లుటౌన్: బ్రిటీష్ పాలకుల పాలిట సింహస్వప్నంగా నిలిచిన టిప్పుసుల్తాన్ 226వ వర్ధంతిని టిప్పుసుల్తాన్ ఇత్తహాదుల్ ముస్లిమీన్(టిమ్) కమిటీ నాయకులు ఘనంగా నిర్వహించారు ఆదివారం స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలోని రోగులకు పండ్లు, బ్రెడ్డు పంపిణీ చేశారు. నాయకులు మాట్లాడుతూ టిప్పుసుల్తాన్ ఆశయాల సాధనకు పాటుపడతామన్నారు. కార్యక్రమంలో టిమ్ కమిటీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎండీ.ఖలీల్, జిల్లా అధ్యక్షుడు ఎం.బి.మౌలా, పట్టణ అధ్యక్షుడు సిరాజ్, కార్యదర్శి ఇమ్రాన్, కోశాధికారి దాదాఖాన్, నాయకులు మసూద్, సిలార్, షేక్షా, ఖలందర్ తదితరులు పాల్గొన్నారు.

7న వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన

శింగనమల: మండల కేంద్రంలోని శింగనమల చెరువు సమీపంలో పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధనోత్సవం ఈ నెల 7న నిర్వహించనున్నట్లు అలయ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. ఆరోజు పూజలతోపాటు అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు.

11,12న వజ్రగిరి బ్రహ్మోత్సవాలు



వజ్రగిరి లక్ష్మీనరసింహస్వామి

పెద్దపప్పూరు: మండలంలోని తిమ్మన చెరువు గ్రామ సమీపంలోని వజ్రగిరి లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 11,12న నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. 11న స్వాముల వారి ఉత్సవమూర్తులను తిమ్మనచెరువు గ్రామం నుంచి కొండపైకి మేళతాళాలతో ఊరేగించుకుంటూ తీసుకెళ్తారు. అదే రోజు రాత్రి హైదరాబాద్ పట్టణానికి చెందిన సంగీత కళాకారులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.12 తెల్లవారుజామున తిరుపతికి చెందిన వేదమురళి క్రిష్ణమాచారి (సామవేద పండితుడు) వారి శిష్యబృందంచే హోమం, శ్రీవారి కల్యాణోత్సవం జరగనుంది. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలిరానున్నారు. తిమ్మనచెరువు, జూటూర గ్రామస్తులు స్వామి వారి కల్యాణోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.



తాడిపత్రిలోని పెన్నానది ఒడ్డున పార్కులో వ్యాయామ పరికరాలతో పట్టణవాసుల కసరత్తు



మార్నింగ్ వాకింగ్ చేస్తున్న పట్టణ వాసులు



యోగాసనాలు వేస్తున్న దృశ్యం

ఆహ్లాదం .. ఆరోగ్యం!

తాడిపత్రిటౌన్: నేటి ఆధునిక యుగంలో శారీరక శ్రమ తగ్గిపోవడంతో మనిషిని రకరకాల వ్యాధులు చుట్టుముడుతున్నాయి. వ్యాధులు నియంత్రణలో ఉండాలన్నా.. వ్యాధి నిరోధక శక్తి పెరగాలన్నా మార్నింగ్‌వాక్ తప్పనిసరి అంటున్నారు వైద్యులు. మార్నింగ్ వాక్‌కు తాడిపత్రి పట్టణ ప్రజలకు పెన్నానది ఒడ్డున వున్న పార్క్ చక్కని వేదిక అయింది. పచ్చని చెట్లు, రకరకాల పూలతో ఆహ్వానం పలుకుతాయి. పెన్నానది మీద నుంచే వీచే చల్లని గాలులు, సహజమైన వెలుతురు మనసుకు ఆహ్లాదాన్ని అందిస్తున్నాయి. దీంతో పట్టణ వాసులు చాలా మంది పార్కులో మార్నింగ్, ఈవెనింగ్ వాకింగ్ చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. పార్కులో ఏర్పాటు చేసిన వ్యాయామ పరికరాలు, చిన్న పిల్లల ఆట వస్తువులు ఆకట్టుకుంటున్నాయి. వేసవి సెలవులు కావడంతో చిన్న పెద్దా తేడా లేకుండా అందరూ పార్కుకు వెళ్లి ఆనందంగా గడుపుతూ ఆరోగ్యాన్ని పెంపొందించుకుంటున్నారు.

వైభవంగా భగీరథ మహర్షి జయంతి



భగీరథ చిత్రపటానికి పూజలు చేస్తున్న దృశ్యం

గుంతకల్లుటౌన్: కఠోరమైన దీక్షతో దివి నుండి భువికి గంగను రప్పించిన భగీరథ మహర్షి జయంతి వేడుకలను సగర (ఉప్పర) సంఘం నాయకులు వైభవంగా నిర్వహించారు. ఆదివారం సగర సేవా సంఘం కార్యాలయంలో భగీరథ మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి టెంకాయలు సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు భగీరథ మహర్షి గొప్పతనాన్ని వివరించారు. కార్యక్రమంలో సగర సంఘం నాయకులు భీమలింగప్ప, విశ్వనాథ్, నారప్ప, రమేష్, అశోక్, నారాయణస్వామి, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి: గుత్తిలో ఆదివారం సగర సంఘం ఆధ్వర్యంలో భగీరథ మహర్షి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సగర సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులు వెంకప్ప, వేణు ఆధ్వర్యంలో సభ్యులు, ఉప్పర కులస్తులు భగీరథ విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బైక్ ర్యాలీ నిర్వహించారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



చిన్నపప్పూరులో స్వామిని దర్శించుకుంటున్న భక్తులు



అలంకరణలో కోటంక సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

పెద్దపప్పూరు: వైశాఖ మాసం ఆదివారం సందర్భంగా మండలంలోని చిన్నపప్పూరు సమీపంలో వెలసిన అశ్వత్థ నారాయణస్వామిని భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు అర్చకులు బాలసుబ్రమణ్యశర్మ, సుధీర్‌కుమార్‌శర్మ, సునీల్‌కుమార్‌శర్మ తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈఓ సుబ్రమణ్యం భక్తులకు సౌకర్యాలు కల్పించారు.

కోటంకలో..

గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన గుంటి కింద సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ప్రధాన అర్చకుడు రామాచార్యులు అభిషేకం, కుంకుమార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తుల సౌకార్యార్థం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ముస్లిం పిల్లలకు ఉచిత ఖత్నా



నిత్యావసర సరుకుల పంపిణీ దృశ్యం

పామిడి: పట్టణంలోని షాదీఖానాలో ఆదివారం ముస్లిం యువత ఆధ్వర్యంలో పేద ముస్లిం పిల్లలకు ఉచిత ఖత్నా నిర్వహించారు. ఈ సందర్భంగా 50 మంది పేద పిల్లలకు ఖత్నా చేపట్టారు. అనంరతం ప్రతి పిల్లవాడికీ గోధుమపిండి, బెల్లం, కొబ్బెర, దుస్తులు, మందులు అందజేశారు. కార్యక్రమంలో ముస్లిం యువత నజీర్, ఇంతియాజ్, ఖలంధర్, జమీర్, ఖాజా, షెక్షా, సల్మాన్, హసన్, జిలాన్, శైలు, మన్సూర్, పిల్లలు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయండి



గార్లదిన్నె మండలం కోటంకలో శైలజానాథ్‌కు స్వాగతం పలుకుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



శింగనమల మండలం కల్లుమడిలో శైలజానాథ్‌ను సన్మానిస్తున్న నాయకులు

గార్లదిన్నె/శింగనమల: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ శింగనమల నియోజకవర్గ సమన్వయ కర్త సాకే శైలజానాథ్ సూచించారు. గార్లదిన్నె మండలంలోని కోటంకలో ఆదివారం అయనకు వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనంగా స్వాగతం పలికి, పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా శైలజానాథ్ వైఎస్సార్‌సీపీ నాయకులతో సమావేశమై పార్టీ అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. అనంతరం కోటంక కొండల్లో వెలసిన గుంటి కింద సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని దర్శించుకున్నారు. అలాగే పలు వివాహ వేడుకల్లో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు నారాయణ రెడ్డి, నాయకులు ఎల్లారెడ్డి, భాస్కర్‌రెడ్డి, నాగరాజు, ఓబిరెడ్డి, కోటంక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే శింగనమల మండలంలోని కల్లుమడి గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు రామక్రిష్ణారెడ్డి గృహ ప్రవేశం కార్యక్రమానికి శైలజానాథ్ హాజరయ్యారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రైతు విభాగం కార్యదర్శి తరిమెల వంశీగోకుల్‌రెడ్డి, నాయకులు కొండయ్య, కాసి, ఆదిరెడ్డి, హరి, రామకృష్ణరెడ్డి, మధు, పెద్ద నరసప్ప పాల్గొన్నారు.

ప్రయాణం .. ప్రమాదకరం



బండల ట్రాక్టర్ టైర్లు పైకి లేచిన దృశ్యం

తాడిపత్రి రూరల్: పట్టణంలో బండల ట్రాక్టర్లు ప్రమాదకరంగా తిరుగుతున్నాయి. కెపాసిటీకి మించి బండలను లోడ్ చేసుకోవడంతో ఇంజన్‌కు ఉన్న ముందు టైర్లు రోడ్ల కంటే అడుగుకు పైగా లేస్తున్నాయి. ఈ సమయంలో అదుపు తప్పితే అంతే సంగతులు. రోడ్డుపై వెళుతున్న వారిని పరిస్థితి ప్రమాదంలో పడవేస్తున్నాయి. పోలీసులు, ఆర్టీఓ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల బండల ట్రాక్టర్లు నిబంధనలకు పాతర వేస్తున్నాయి.



గార్లదిన్నె హైస్కూల్లో పూర్వ విద్యార్థుల కలయిక



యాడికి మండలం రాయలచెరువులో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



పుట్లూరు మండలం కడవకల్లులో ..

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

గుంతకల్లు/యాడికి/పుట్లూరు/గార్లదిన్నె: గుంతకల్లు పట్టణంలోని శ్రీ శంకరనంద గిరి స్వామి డిగ్రీ కళాశాలలో ఆదివారం 2002–25 సంవత్సరం విద్యార్థుల సమ్మేళనం ఉత్సాహంగా సాగింది. బీకాం జనరల్, బీకాం కంప్యూటర్స్ చెందిన వీరు దాదాపు 20 ఏళ్ల అనంతరం కలుసుకుని అప్పటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ గోపాల్‌తోపాటు అప్పటి గురువులు నారాయణ, గోపి, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, సౌజన్య తదితరులను శాలువాలు, పూలమాలతో సతరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు జక్కీ, వేణుగోపాల్, రాకేష్, గణేష్, సృజన, బద్రి, సులక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

- యాడికి మండలంలోని రాయలచెరువు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1999–2000లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం తాము చదువుకున్న పాఠశాలలో పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఏపీ, కర్నాటక, తెలంగాణ రాష్ట్రాల్లో వివిధ వృత్తుల్లో స్థిరపడిన సుమారు 150 మంది దాకా కలుసుకున్నారు. ఈ సందర్భంగా చదువు చెప్పిన గురువులను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు డేనియల్, జయదేవమ్మ, గురువులు నాగరాజు శర్మ, సుబ్రమణ్యం, రమేష్, మల్లికార్జున, రబిరసూల్ , రవి బాబు, పూర్వ విద్యార్థులు పద్మనాభరెడ్డి, ముత్యాలరెడ్డి, రమణ గౌడ్, మనోహర్, రామకృష్ణ , మల్లికార్జున, మహేశ్వర రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, రవికుమార్ పాల్గొన్నారు.
- పుట్లూరు మండలంలోని కడవకల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 2003–2004 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. అప్పటి ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో బ్రహ్మర్షి మాడుగుల వెంకటసుబ్రమణ్యశర్మ, ఎంఈఓ నాగరాజు, ఉపాధ్యాయులు పెద్దయ్య, శశికళ, క్రిష్ణవేణి, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.
- గార్లదిన్నె జిల్లా పరిషత్ హైస్కూల్లో ఆదివారం 2002–2003లో చదివిన విద్యార్థులు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. అప్పటి ఉపాధ్యాయులు రాంభూపాల్ రెడ్డి, ఇషాక్, కల్పలత, బంగారప్ప, నారాయణ రెడ్డి, క్రిష్టప్ప,ఆదినారాయణ, ఎర్రిస్వామి, శశిదేవి, ఎలిజబెత్,అనిల్, సాయినాథ్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో శివ, లింగమయ్య, రఘు, ప్రతాప్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, శ్రీనాథ్ రెడ్డి, రవి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



గుంతకల్లులో అప్పటి గురువులతో పూర్వ విద్యార్థులు

పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలసిన రమేష్‌రెడ్డి



పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో కొణిదల రమేష్‌రెడ్డి

తాడిపత్రిటౌన్: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కొణిదుల రమేష్‌రెడ్డి ఆదివారం తిరుపతిలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా తాడిపత్రి రాజకీయాలపై ఆయన ఆరా తీసినట్లు తెలిపారు. నాయకులు, కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని తెలిపారన్నారు. ఆయనతో పాటు తాడిపత్రికి చెందిన పలువురు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలున్నారు.

19 నుంచి సువార్త మహాసభలు

పామిడి: పట్టణంలోని బైపాస్‌లో ఈ నెల 19, 20, 21న శాశ్వత కృపా పరిచర్య ఆధ్వర్యంలో నిర్వహించే సువార్త మహాసభలను జయప్రదం చేయాలని నిర్వాహకులు ప్రభాకర్ ఛార్లెస్, విజయ్ ఛార్లెస్ ఆదివారం తెలిపారు. సువార్త సభలకు గుంటూరు యూదా మినిస్ట్రీస్ పాస్టర్ నెహెమ్యా ముఖ్య ప్రసంగీకులుగా విచ్చేయనున్నారన్నారు. రోజూ సాయంత్రం 6 గంటలకు సువార్త సభలు ప్రారంభమవుతాయన్నారు. క్రైస్తవ విశ్వాసులు, క్రైస్తవేతరులు సువార్త సభల్లో పాల్గొని దైవాశీస్సులు పొందాలని వారు కోరారు.

సజావుగా నీట్ పరీక్షలు



పరీక్ష రాసేందుకు వచ్చిన అభ్యర్థులు

గుత్తి: పట్టణంలోని ఏపీ మోడల్ స్కూల్లో ఆదివారం భారీ పోలీసు బందోబస్తు మధ్య నీట్ పరీక్షలు నిర్వహించారు. ఉదయం 11 గంటల నుంచి అభ్యర్థులను పరీక్ష హాల్లోకి అనుమతి ఇచ్చారు. పరీక్షకు మొత్తం 279 మంది అభ్యర్థులకు గాను 8 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐలు సురేష్, ఆశా బేగం, ఏఎస్ఐ గోపినాథ్ ఆధ్వర్యంలో సిబ్బంది పరీక్ష కేంద్రం వద్ద బందోబస్తు నిర్వహించారు.

ఆధార్ క్యాంపులు సద్వినియోగం చేసుకోండి

గుత్తి రూరల్: మండలంలోని బసినేపల్లి, తురకపల్లి, తొండపాడు, కొజ్జేపల్లి గ్రామాల్లోని గ్రామ సచివాలయాల్లో సోమవారం నుంచి ఈ నెల 15 వరకూ నిర్వహించే ప్రత్యేక ఆధార్ క్యాంపులు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ప్రభాకర్ నాయక్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 5 6 తేదీల్లో బసినేపల్లి, 7, 8న తురకపల్లి, 12, 13న తొండపాడు, 14, 15 తేదీల్లో కొజ్జేపల్లి సచివాలయాల్లో ఆధార్ క్యాంపులు ఉంటాయన్నారు. ప్రజలు, విద్యార్థులు ఆధార్ కార్డులలో తప్పులు, పేరు మార్పు లేదా అడ్రస్ మార్పు లాంటివి సరి చేసుకోవచ్చన్నారు. రోజూ ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకూ సచివాలయ సిబ్బంది ఆధార్ క్యాంపులలో అందుబాటులో ఉంటారన్నారు.

బొలెరోలో ప్రయాణికులను తరలించొద్దు



డ్రైవర్‌ను హెచ్చరిస్తున్న ఎస్ఐ నాగేంద్రప్రసాద్

పెద్దపప్పూరు: నిత్యావసర సరుకుల రవాణా కోసం అనుమతి ఉన్న బొలెరో వాహనాల్లో ప్రయాణికులను ఎక్కించుకోవద్దని ఎస్ఐ నాగేంద్రప్రసాద్ హెచ్చరించారు. ఆదివారం సాయంత్రం ఆయన మండలంలోని ముచ్చుకోట హైవేలో వాహనాలు తనిఖీ చేశారు. బొలెరో వాహనంలో అధికసంఖ్యలో ప్రయాణికులను తరలిస్తున్న డ్రైవర్లకు ఆయన కౌన్సెలింగ్ ఇచ్చారు. తొలివిడతగా జరిమానా విధిస్తున్నామని, పునరావృతమైతే వాహనాల్ని సీజ్ చేస్తామని ఆయన హెచ్చరించారు.

నేడు 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'

గుత్తి రూరల్: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించన్నట్లు తహసీల్దార్ ఓబిలేసు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు తప్పకుండా హాజరు కావాలన్నారు. ఫిర్యాదు పత్రాల్లో ప్రజలు ఆధార్, సెల్‌ఫోన్ నంబర్లు నమోదు చేయాలన్నారు.

కుంగిన కల్వర్టు



మార్కెట్ నుంచి కేపీఎస్ థియేటర్‌కు వెళ్లే దారిలో దెబ్బతిన్న కల్వర్టు

గుంతకల్లుటౌన్: పట్టణంలోని కేపీఎస్ థియేటర్ గల్లీలో పరిమితికి మించిన భారీ వాహనాల రాకపోకలు సాగడంతో అక్కడ కల్వర్టు కుంగిపోయి గుంత ఏర్పడింది. వాహనదారులు ఆదమరిచి వెళ్తే పెద్ద ప్రమాదాల బారిన పడే అవకాశముంది. పట్టణంలో దెబ్బతిన్న కల్వర్టులను మరమ్మత్తులు చేయించాలని ఆయా వార్డుల కౌన్సిలర్లు కౌన్సిల్ సమావేశాల్లో అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. ఇప్పటికైనా అధికారులు ఛిద్రమైన ఆ కల్వర్టులను తొలగించి, ఆ స్థానంలో కొత్త కల్వర్టులను నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

తవ్వారు... వదిలేశారు!



రోడ్డు పక్కన ప్రమాదకరంగా గుంత

గుత్తి: గుత్తి ఆర్ఎస్ రోడ్డులో రెండు నెలల క్రితం పైప్‌లైన్ ఏర్పాటు కోసం పెద్ద గుంతను తవ్వారు. పైప్‌లు ఏర్పాటు చేశారు. కానీ గుంతను అలాగే వదిలేశారు. ప్రధాన రోడ్డు పక్కనే పెద్ద గుంత ఉండటంతో ఎపుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు, వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి గుంతను పూడ్చి వేయాలని పాదచారులు, వాహనదారులు కోరుతున్నారు.